

భరోసా.. భయం..

రైతు భరోసా సాయంపై ఆందోళన

- సాగు చేయని భూములకు సర్కార్ ఝలక్
- పంట సాగులో ఉన్న భూములకే భరోసా అంటూ ప్రకటన
- పీఎం కిసాన్ నిధి మార్గదర్శకాలను రైతు భరోసాకు అమలు చేసే యోచన
- ఉద్యోగులు, పెన్షనర్లు, ఐటీ చెల్లింపుదారులు, డాక్టర్లు, లాయర్లకు భరోసా లేనట్టే
- ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8.90 లక్షల మంది కర్షకులకు రైతుబంధు
- అనర్హులను ఏరివేసి.. సాగు రైతులకే భరోసా ఇచ్చేలా ప్రభుత్వం వ్యూహం
- తెరపైకి 10 ఎకరాల వరకే రైతు భరోసా ఇవ్వాలనే డిమాండ్
- సంక్రాంతికి భరోసా అందిస్తామని ప్రభుత్వ ప్రకటనతో రబీ రైతులకు ఊరట

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రైతు భరోసా సాయంపై ఉత్కంఠ నెలకొంది. పథకంపై ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన ప్రకటనతో ప్రభుత్వ పెట్టుబడి సాయానికి అర్హులెవ్వరనేది ఆసక్తికరంగా మారింది. సాగు చేసే భూములకే రైతు భరోసా ఆర్థిక సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గత ప్రభుత్వం బీడు భూములు, రాళ్లు, రప్పలున్న భూములకు రైతుబంధు ఇచ్చిందనే ఆరోపణలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ నిధి మార్గదర్శకాలను రైతు భరోసాకు వర్తింప చేసేందుకు కసరత్తు చేస్తుంది. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ చెల్లింపుదారులు, డాక్టర్లు, లాయర్లు తదితర వర్గాలకు రైతు భరోసా కోత పెట్టే యోచనలో ప్రభుత్వం ఉంది. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతు బంధు పథకం ద్వారా 8.90 లక్షల మంది అన్నదాతకు పెట్టుబడి సాయం అందుతుండగా, ప్రభుత్వ తాజా ప్రకటనతో ఓరుగల్లు రైతుల్లో ఎవరెవరికి భరోసా అందనుందో అనే ఉత్కంఠ నెలకొంది.

సాగు చేయని భూములకు ఝలక్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 15.61 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. అయితే సాగు భూములకంటే అధికంగా పెట్టుబడి సాయం దారి తప్పుతుంది. బంజార భూములు, సాగుకు పనికి రాని భూములు, కొండలు, గుట్టలకు కూడా రైతు బంధు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వం రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని అర్హులైన రైతులకే ఇవ్వాలని ప్రణాళిక రూపొందిస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు ద్వారా ఏటా అందుతున్న ఎకరాకు రూ.10వేల సాయాన్ని, రైతు భరోసాగా పథకాన్ని మార్చి, ఎకరాకు రూ.15,000లు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినప్పటికీ రైతుభరోసా ఇవ్వకపోవడమే కాకుండా, గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకం కింద వచ్చే రూ.10 వేల సాయం కూడా గత రెండు పంటలకు ఇవ్వకపోవటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఖరీఫ్‌లోనే అతివృష్టి, అనావృష్టితో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రబీ సాగుకు సిద్ధమైన రైతులకు పెట్టుబడి సాయం లేక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అసెంబ్లీలో చేసిన ప్రకటన రైతులకు కొంత ఊరటనిచ్చింది. సంక్రాంతి నుంచి రైతు భరోసాను అమలు చేస్తామని ప్రకటించారు. అయితే గత ప్రభుత్వం తరహాలో సాగులో లేని భూములకు రైతు భరోసా ఇవ్వమని చెప్పారు. గతంలో బీడు భూములు, సాగులో లేని భూములకు కూడా రైతు భరోసా అమలు చేశారు. వందల ఎకరాల భూములన్న భూస్వాములకు కూడా రైతు బంధు ద్వారా పెట్టుబడిసాయాన్ని అందించారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం సాగులో లేని భూములకు రైతు భరోసా ఇచ్చేది లేదని తేల్చి చెప్పింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రైతు బంధుకు భారీ కోత పడే అవకాశం ఉందనే చర్చ జరుగుతుంది.

రైతు భరోసాకు పీఎంకే నిధి మార్గదర్శకాలు..?

రైతు భరోసా ద్వారా ఎకరాకు రూ.7,500ల చొప్పున రెండు పంటలకు రూ.15,000లు ప్రభుత్వం

మిగతా 7వ పేజీలో...

పెట్టుబడి సాయంలో భారీ కోతలే

ప్రభుత్వం రైతు భరోసాకు పీఎంకే నిధి పథకంలోని నిబంధనలను వర్తింప చేయాలని భావిస్తుందనే ప్రచారం రైతుల్లో గుబులు రేపుతోంది. చాలా మంది గ్రామాల్లో రైతులు బ్యాంకుల్లో రుణాల కోసం ఐటీ చెల్లింపుదారులుగా ఉన్నారు. ఇంటి రుణం, వ్యాపారం రుణం కోసం కనీసం మూడేళ్ల ఐటీ చెల్లించినట్లుగా ఉండాలనే నిబంధన ఉండటంతో రైతులు లేదా వారి పిల్లలు ఆదాయ పన్ను చెల్లిస్తున్నారు. పీఎంకే నిధి రూల్స్ ప్రకారం వరుసగా రెండేళ్ల కంటే ఎక్కువ సంవత్సరాలు ఐటీ చెల్లిస్తే ప్రభుత్వ సాయానికి అర్హులు కాదనే నిబంధన ఉంది. దీంతో రైతు భరోసాకు కూడా దీన్ని వర్తింప చేస్తే చాలా మంది రైతులు నష్టపోవాల్సి వస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే కుటుంబంలో ఒక్కరికి మాత్రమే పీఎంకే నిధి ద్వారా సాయం అందుతుంది. రైతుబంధులో ఎవరి పేరు మీద ఎంత భూమి ఉంటే అంతే సాయం అందిస్తున్నారు. పీఎంకే నిధి నిబంధనలను రైతు భరోసాకు వర్తింప చేస్తే చాలా మంది రైతులకు కోత తప్పదనే టాక్ వినబడుతుంది. అలాగే రైతు భరోసాను 10 ఎకరాల లోపు ఉన్న రైతులకే ఇవ్వాలనే డిమాండ్ కూడా ఉంది. జూలై 15 తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా రైతుల అభిప్రాయాలను మంత్రివర్గ ఉపసంఘం సేకరించింది. బడా రైతులకు కాకుండా చిన్న, సన్నకారు రైతులకు రైతు భరోసా ఇవ్వాలనే సూచనాలు ఎక్కువగా వచ్చాయి. దీంతో ప్రభుత్వం కూడా 10 ఎకరాల లోపు ఉన్న రైతుకే భరోసా అనే నిబంధన పెడుతారా అనేది ఉత్కంఠగా మారింది. మొత్తానికి గత ప్రభుత్వం తరహాలో కాకుండా సాధ్యమైనంత వరకు అనర్హులను ఏరివేసి, సాగు భూములకే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించటం చర్చనీయాంశంగా మారింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు, కేంద్రం అందిస్తున్న పీఎం కిసాన్‌సమ్మాన్ నిధి పథకం ద్వారా లబ్ధిపొందుతున్న రైతులు..

జిల్లా	రైతుబంధు రైతులు	పీఎంకేఎస్‌నిధి రైతులు
వరంగల్	1,54,822	65,361
హనుమకొండ	1,45,044	56,409
జనగామ	1,79,735	81,487
మహబూబాబాద్	2,14,685	90,978
భూపాలపల్లి	1,16,171	48,496
ములుగు	79,330	39,159
మొత్తం	8,89,787	3,81,890



కొప్పూర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా మహా కోలాట ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు

శ్రీరామదూత శిరసా నమామి

- వెయ్యి మంది మహిళలతో భక్తి పారవశ్యం
- అలరించిన అతివల కోలాటం.. గిన్నిస్ కెక్కిన కొప్పూర్

7



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ఆపదలో ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముందుగా పేదలకు మెరుగైన వైద్యం అందేందుకు ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని అన్నారు. అలాగే ఆరోగ్యశ్రీలోకి రాని పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందిస్తున్నామని తెలిపారు. అవసరమైతే ఎల్‌వోసీలు ఇచ్చి వైద్యం అందిస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఆగిపోయిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రిలీజ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. ఒక్క భూపాలపల్లి నియోజకవర్గంలోనే సుమారు 6వేల మందికి ఈ సాయం అందించి ఆపదలో ఆదుకున్నామని తెలిపారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజలను ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం, పేదలకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని గుర్తు చేశారు. కనీసం రిటైర్డ్ అయిన ఖాళీలను కూడా భర్తీ చేయలేదని మండిపడ్డారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారెంటీలను అమలులోకి తీసుకురావడమే కాకుండా ఉద్యోగాల కల్పన చేస్తోందని అన్నా రు. ఈ సమావేశంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, నాయకులు చల్లూరి మధు, బుర్ర కొంరయ్య, దాట్ల శ్రీనివాస్, అప్పం కిషన్, రాజే ందర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



కోల్‌బెల్ట్‌లో సింగరేణికి విశిష్ట స్థానం ఉంది. ఆంగ్లేయుల పాలన నుంచి మనుగడలో ఉన్న ఈ సంస్థ బొగ్గు నిక్షేపాల వెలికితీతతో దేశప్రగతికి తోడ్పాటు అందిస్తోంది. తెలంగాణకు మణిహారంగా ఉన్న ఈ కంపెనీ ప్రధాన ఆర్థిక వనరుగా వర్ధిల్లుతోంది. అనేక ఒడిదుడుగులను ఎదుర్కొంటూ తన ప్రయాణాన్ని సాగిస్తూ 136వ వసంతంలోకి అడుగుపెడుతోంది.

తవ్వేకొద్దీ ప్రగతి

దినదినాభివృద్ధి చెందుతున్న సింగరేణి

- ఒడిదుడుగులను అధిగమిస్తూ అంచెలంచెలుగా రాణింపు
- 1889 నుంచి బొగ్గు నిక్షేపాల వెలికితీత
- నేడు 136వ వసంతంలోకి..

కాకతీయఖని, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆంగ్లేయుల కాలంలో 1870లో బొగ్గు ఉత్పత్తి సంస్థ తెలంగాణ ప్రాంతంలో ఆవిర్భావించింది. తొలుత హైదరాబాద్ దక్కన్ కంపెనీ పేరుతో ఏర్పాటైన ఈ సంస్థ ఆధ్వర్యంలో 1889లో బొగ్గు తవ్వకాలకు అంకురార్పణ జరిగింది. మొట్ట మొదటగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఇల్లందు (అప్పటి బొగ్గుట్ట)లో ఉత్పత్తి ప్రారంభమైంది. 1975లో శ్రీరాంపూర్, మణుగూరు, 1961లో మందమర్రి, రామగుండం, 1937లో కొత్తగూడెం, 1928లో బెల్లం పల్లి, 1992లో భూపాలపల్లి ప్రాంతాల్లో బొగ్గు తవ్వకాలు ప్రారంభమయ్యాయి. 1920 డిసెంబరు 23న హైదరాబాద్ దక్కన్ కంపెనీ పేరును సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చారు. అప్పటి నుంచి ఏటా డిసెంబరు 23న సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే సోమవారం ఆ వేడుకలు ప్రారంభమవుతున్నాయి.

లాభాల బాటలో..

సింగరేణిలో కేంద్ర ప్రభుత్వం వాటా 49 శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటా 51శాతం ఉంది. 1960 నుంచి ఈ నిష్పత్తి కొనసాగుతోంది. తెలంగాణలో ఒక్క బొగ్గు గనితో ప్రారంభమైన సింగరేణి ఎన్నో ఒడి దుడుకుల ను ఎదుర్కొంటూ అంచెలంచెలుగా అభి వృద్ధిసాధిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాలోని 11ఏరియాల్లో ప్రస్తుతం 22 భూగర్భ గనులు, 11 ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఒక్క భూపాలపల్లి ఏరియా తప్ప అన్ని ప్రాంతాల్లోనూ సింగరేణి లాభాల బాటలో నడుస్తోంది. భూపాలపల్లిలో కొన్ని పరిస్థితుల దృష్ట్యా బొగ్గు ఉత్పత్తిని సాధించలేకపోతున్నారు. అయినా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని, అన్ని ఏరియాల్లోలాగే భూపాల పల్లిలోనూ టార్గెట్‌ను సాధిస్తామని ఇక్కడి అధికార వర్గం కృతనిశ్చయాన్ని వ్యక్తం చేస్తోంది.

విస్తరణకు ఆటంకాలు

సింగరేణి విస్తరణ రోజురోజుకు కఠినతరంగా మారుతోందని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. బొగ్గు గనులను విస్తరణకు భూ సేకరణ కీలకం కాగా ఇది ఈ ప్రక్రియకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. భూములు ఇచ్చేందుకు రైతులు సుముఖంగా లేకపోవడం, అటవీ శాఖ, పర్యావరణ మండలి అనుమతులు రాకపోవడం తదితర అంశాలు అవరోధంగా మారాయి.

ఇతర రంగాల్లోకి అడుగులు

సింగరేణి యాజమాన్యం తన మనుగడను కొనసాగించుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. బొగ్గు ఉత్పత్తి, రవాణా పైనే ఆధారపడకుండా జియోథర్మల్ విద్యుత్, సోలార్, హైడల్ (జల), పవన విద్యుత్ రంగాలపై దృష్టి సారిస్తోంది. ఇప్పటికే సోలార్ విద్యుత్‌ను తయారు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థను ప్రైవేటీకరించేందుకు బొగ్గు బ్లాకులను వేలం వేస్తుంటే తన మనుగడను రక్షించుకునేందుకు నూతన మార్గాలను సింగరేణి అన్వేషిస్తోంది.

భూపాలపల్లి బొగ్గు నిక్షేపాలు

గోదావరి పరీవాహక ప్రాంతమైన భూపాలపల్లి ఏరియాలో బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు 1985లో జియాలాజికల్ సర్వే విభాగం గుర్తించింది. దీంతో 1988 జులై 15న అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు చేతుల మీదుగా ఏరియాలో కాకతీయఖని పేరుతో 1వ గనిని

మిగతా 8వ పేజీలో..

ముస్తాబైన భూపాలపల్లి

సింగరేణి ఆవిర్భావ దినోత్సవానికి భూపాలపల్లి ముస్తాబైంది. సోమవారం ఈ వేడుకలు జరగనుండగా పట్టణంలోని ఏరియా జీఎం కార్యాలయం, అంబేద్కర్ క్రీడా మైదానంలో ఏర్పాట్లను ఆ సంస్థ అధికారులు పూర్తి చేశారు. సింగరేణీయులతోపాటు పరిసర ప్రాంత ప్రజలు ఈ వేడుకలకు హాజరుకానున్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను జీఎం రాజేశ్వర్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. అంబేద్కర్ క్రీడా మైదానంలో లైటింగ్, స్టాళ్లు, కుర్చీల ఏర్పాట్లు సజావుగా ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరుకానున్నారు.



సింగరేణి వేడుకలకు ముస్తాబైన భూపాలపల్లి అంబేద్కర్ క్రీడా మైదానం

అనుమానాస్పదంగా లారీ డ్రైవర్ మృతి

- ములుగు జిల్లా కేంద్రం శివారులో ఘటన
- మృతదేహంపై గాయాలు.. సమీపంలో మద్యం సీసాలు
- హత్య జరిగినట్టు ఆనవాలు

ములుగు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన ములుగులో చోటుచేసుకుంది. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఒర్సు శ్రీనివాస్(42) తలకు తీవ్రగాయాలతో కన్నుమూశాడు. ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా చెన్నూరుకు చెందిన శ్రీనివాస్ హనుమకొండలో భార్యాపిల్లలతో నివాసం ఉంటూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండకు చెందిన లింగారావు అనే వ్యక్తి వద్ద లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరిన అతడు ఆదివారం ఉదయం వరకు రేగొండకు చేరుకోలేదు. ఆదివారం ఉదయం ములుగు-బండారుపల్లి మధ్య మదర్సా వెనుక ఖాళీ ప్రదేశంలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. జేబులో దొరికిన ఆధార్‌కార్డు ద్వారా ఆయన వివరాలు సేకరించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలంలో రాళ్లకుప్ప ఉండటం, మృతుడి తలకు తీవ్ర గాయాలు కావడంతో హత్య కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. మృతదేహానికి సమీపంలో మద్యం సీసాలు పడి ఉండటాన్ని బట్టి శ్రీనివాస్‌తోపాటు ఒకరిద్దరు వ్యక్తులు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అతనికి చెందిన మొబైల్ ధ్వంసమైన స్థితిలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉద్దేశపూర్వకంగా దాడి చేసి హత్యచేసి ఉంటారని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు జరిపారు. అనంతరం మృతదేహాన్ని ములుగులోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల మార్చురీకి తరలించారు. మృతుడు శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.



ఘటనా స్థలిలో శ్రీనివాస్ మృతదేహం

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

చిట్యాల, డిసెంరు 22 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మరోకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రంలోని క్రోసూర్‌పల్లి శివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నైన్‌పాక గ్రామానికి చెందిన బైరి శంకర్ సొంత పని నిమిత్తం స్కూటీపై చిట్యాల మండల కేంద్రానికి బయల్దేరాడు. భూపాలపల్లి మండలం గొర్లవేడు గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ తాళ్ల మార్కండేయ చిట్యాల మండలం రామచంద్రాపురంలో వివాహ శుభకార్యానికి హాజరై చిట్యాల వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తూ స్కూటీని ఢీకొట్టాడు. ఈఘటనలో మార్కండేయ తలకు బలమైన గాయాలయ్యాయి. శంకర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై శ్రావణ్ కుమార్, కానిస్టేబుల్ లాల్‌సింగ్‌లు క్షతగాత్రుడిని చిట్యాల సామాజిక ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి పంపారు.

ఆదర్శప్రాయుడు వెంకటస్వామి

అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి జీవితం ఆదర్శప్రాయమని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ కొనియాడారు. వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ లర్పించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి వెంకటస్వామి కృషిచేశారన్నారు. సామాజిక అసమానతలను రూపుమాపేందుకు పోరాడారని తెలిపరాఉ. శ్రామిక వర్గాల అభ్యున్నతికి కోసం ఆయన పాటుపడిన ఆయన అనేక ఉద్యమాలు చేశారని కొనియాడారు. వెంకటస్వామి చేసిన సేవలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతి వేడుకలు, వర్ధంతిని నిర్వహిస్తోందని తెలిపారు. ఈకార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ఆదర్శ విద్యాలయంగా తీర్చిదిద్దాలి

- కూనూరు హైస్కూల్ అభివృద్ధికి చర్యలు
- పాఠశాలకు పూర్వ విద్యార్థులు తోడ్పడాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- ముగిసిన స్కూల్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు

జఫర్‌గఢ్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కూనూరు పాఠశాలను ఆదర్శ విద్యాలయంగా తీర్చిదిద్దాలని, స్కూల్ అభివృద్ధికి, పూర్వ విద్యార్థులు సహకారం అందించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. కూనూరు జడ్పీ హైస్కూల్‌లో గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీహరి మాట్లాడుతూ 1974నుంచి నేటి వరకు టెన్త్ చదువుకున్న సుమారు 6 వేల మంది 50ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి రావడం అనందంగా ఉందన్నారు. హైస్కూల్‌కు వచ్చే విద్యా సంవత్సరం నాటికి 12కంప్యూటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్‌ల ఏర్పాటుకు రెండు గదులను, నిర్మించనున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రహరీని ఎత్తు పెంచేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేసుకుని విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పనకు ఓ మినీ బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశానికి ముందు పాఠశాల ఆవరణలోని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహానికి ఎమ్మెల్యే శ్రీహరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సావనీర్ పుస్తకాలను, కూనూరు పాఠశాల పేరుతో ఏర్పాటు చేసిన యూట్యూబ్ చానల్, వెబ్‌సైట్‌ను పూర్వ విద్యార్థుల సమక్షంలో ప్రారంభించారు. గురువులను మెమెంటోలు, శాలువాలు, పూలమాలలో ఘనంగా సత్కరించారు. స్వర్ణోత్సవాల కమిటీ కన్వీనర్ నాగమళ్ల అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, కమిటీ ప్రతినిధులు గంగిడి వెంకటేశ్వర్‌రెడ్డి, కాటం లక్ష్మారెడ్డి, ఆకుల కుమారస్వామి, పిట్ట రాజు, పల్లెపాటి జయపాల్‌రెడ్డి, అమరోజు శ్రీనివాస్, బెల్లి సరిత, శోభారాణి, ప్రమోద్‌రెడ్డి, నెల్లుట్ల వాసు, జితిన్, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

తొమ్మిది నెలల శ్రమ ఫలించింది

నాగమళ్ల అశోక్, స్వర్ణోత్సవాల కమిటీ కన్వీనర్



1974 నుంచి 2024 వరకు కూనూరు హైస్కూల్‌లో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకుచ్చేందుకు తొమ్మిది నెలల పాటు శ్రమించాం. కోర్ కమిటీని ఏర్పాటు చేసుకుని ఆయా బ్యాచ్‌ల వారీగా విద్యార్థులను గుర్తించి సంఘటితం చేశాం. తలా కొంత ఆర్థిక వనరులను సమకూర్చుకుని.. గురువులు, విద్యావేత్తలు, మిత్రుల సలహాలు, సూచనలతో స్వర్ణోత్సవాలను గ్రామస్థుల సహకారంతో విజయవంతంగా నిర్వహించుకోగలిగాం.

ఆనందంగా ఉంది

మౌనిక, పూర్వ విద్యార్థి



ఎన్నో ఏళ్ల తర్వాత స్వర్ణోత్సవాల పేరిట మిత్రులమంతా ఒకే చోట కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. పిల్లా పాపలతో కలిసి వచ్చాను. నాటి స్నేహితులను, గురువులను చూడగానే నాటి మధుర స్మృతులు గుర్తుకు వచ్చాయి. ఇలాంటి అపూర్వ ఘట్టం మరువలేనిది.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్



మహబూబాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రజలకు క్షమాపణ చెప్పి, తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని మహబూబాబాద్ పోరిక బలరాంనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అమిత్‌షా రాజ్యాంగాన్ని, అంబేద్కర్‌ను కించపరుస్తూ వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు రాజ్యాంగ వ్యతిరేక, దళిత వ్యతిరేక మనస్తత్వాన్ని బహిర్గతం చేశాయని చెప్పారు. ఇది ఆర్‌ఎస్‌ఎస్ సైద్ధాంతిక వైఖరిని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం కేవలం చట్టపరమైన పత్రం కాదని, మన ప్రజాస్వామ్యానికి పునాది అని వివరించారు. అమిత్‌షా వ్యాఖ్యలను ప్రతీ ఒక్కరు ఖండించాలని కోరారు.

ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలి

- వరంగల్ క్యాథలిక్ పీఠాధిపతి ఉడుముల బాల
- శనిగపురంలో బంజార సెమీ క్రిస్మస్ వేడుకలు


దివ్యాంగుడికి నిత్యావసరాలు అందిస్తున్న ఉడుముల బాల

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 17 : ప్రతీ ఒక్కరు ఏసు క్రీస్తు చూపిన సన్మార్గంలో నడిచి, ఇతరులకు తమవంతు సేవ చేయాలని వరంగల్ క్యాథలిక్ పీఠాధిపతి ఉడుముల బాల కోరారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని శనిగపురంలోని మేరీమాతా స్వరూపాన్ని ఆదివారం ఊరేగింపుగా తీసుకువచ్చి మహబూబాబాద్ శివారు శనిగపురం వద్ద ఏసుగుట్టపై ఉన్న మేరీమాత విగ్రహం వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మెగా బంజార క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. జిల్లాలోని వివిద గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన క్రైస్తవులు, పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ కులం, మత అనే తారతమ్యం లేకుండా క్రీస్తు జన్మించిన రోజైనా క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ప్రజలు మూఢనమ్మకాలను నమ్మి రోగాల భారీన పడవద్దని సూచించారు. ఏసుగుట్ట మొత్తం దైవసన్నిధి కావాలని, పుణ్యక్షేత్రంగా విరజిల్లాలని చెప్పారు. అనంతరం 50 మంది దివ్యాంగులకు నిత్యాసరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్ హరిసింగ్‌నాయక్, ఫాదర్ రేనాల్డ్, జోసఫ్, సైమన్, పాల్‌రాజ్, జోషి పాల్గొన్నారు.

పోరాటాలతోనే ఎస్టీ వర్గీకరణ సాధ్యం

జాతీయ ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ లింగయ్య దొర


తుడుందెబ్బ రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న చందా లింగయ్య

ఏటూరునాగారం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ పోరాటాల ద్వారానే ఎస్టీ వర్గీకరణ సాధ్యమని జాతీయ ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ చందా లింగయ్య దొర అన్నారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) 9వ రాష్ట్ర మహాసభలు ఆదివారం ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ అధ్యక్షన జరిగింది. దీనికి ముందు ఏటూరునాగారంలోని వై-జంక్షన్ నుంచి ఐటీడీఏ మీదుగా గిరిజన భవన్ వరకు భాంసనీ ర్యాలీని నిర్వహించారు. మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన లింగయ్య మాట్లాడుతూ 1970 నుంచి ఆదివాసీ హక్కుల కోసం పోరాడుతున్నామని, ఈ క్రమంలో ఏజెన్సీ ప్రాంతాల్లో చాలా చట్టాలు వచ్చాయని అన్నారు.

వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐక్య పోరాటాల ద్వారా మాత్రమే ఎస్టీ వర్గీకరణ సాధ్యం అవుతుందని, ఆదివాసీలు ఇందుకు కృషి చేయాలన్నారు. తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ మాట్లాడుతూ ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం 1996లో ఉమ్మడి వరంగల్ కేంద్రంగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ)గా ఏర్పాటు అయి ఆవిర్భావం చెందినది ఆయన గుర్తు చేశారు.

నాటి నుంచి నేటి వరకు ఆదిలాబాద్ నుంచి శ్రీకాకుళం వరకు ఆదివాసీలల్లో చైతన్యం నింపి ఆదివాసీల కోసం ప్రత్యేక చట్టాలు, హక్కులు రావడంలో క్రియాశీలకంగా వ్యవహరించిందన్నారు. సాగులో ఉన్న ఆదివాసీలకు హక్కు పత్రాలు ఇవ్వాలని, పది ఎకరాలు ఉన్న ఆర్వోఎఫ్ఆర్ పట్టాలకు బలోపేతం చేసి ఐటీడీఏ పరిధిలోని 29 శాఖలు బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్ర మంలో తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణ లక్ష్మ య్య, తుడుందెబ్బ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వట్టం నారాయణ దొర, గొండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, తుడుందెబ్బ జాతీయ కోకన్వీనర్ యాసం రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమురం శేషయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంపిడి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి చింత కృష్ణ, ములుగు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వట్టం జనార్దన్, చందా మహేష్, మహబూబాబాద్ అధ్యక్ష కార్యదర్శులు సువర్ణపాక వెంకట రత్నం, చీమల శివ కుమార్, భద్రాద్రి కొత్తగూడెం అధ్యక్షకార్యదర్శులు దుగ్గారపు వీరభద్రం, చింత వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు బాధిత కుటుంబాల భగ్గు

- పౌరహక్కుల నేతల తీరుపై ఆగ్రహం
- ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా


పౌర హక్కుల సంఘాల నాయకుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మావోయిస్టు బాధిత కుటుంబాలు

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పౌరహక్కుల నేతల తీరుపై మావోయిస్టు బాధిత కుటుంబాలు భగ్గుమన్నాయి. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల చెల్పాక అడవుల్లో ఈ నెల 1న జరిగి న ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణకు వస్తున్నారని తెలిసి నిరసనకు దిగారు. ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆదివారం సా యంత్రం ధర్నా చేశారు. చెల్పాక అడవుల్లో ఎన్ కౌంటర్‌కు ముందు వాజేడు మండలంలో మావోయిస్టుల చేతిలో స్థానికులు ఊకే రమేష్, ఊకే అర్జున్ హత్యకు గురయ్యారని, ఆ సమయంలో నిజనిర్ధారణకు రాని పౌరహక్కుల నేతలు ఎన్‌కౌంటర్ జరిగిందని తెలిసి రావడం ఏమిటని ఆరోపించారు. ఐటీడీఏ కార్యాలయం వద్ద 163 జాతీయ రహదారిపై బైఠాయించారు. మావోయిస్టులు, పౌరహక్కుల నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పౌరహక్కుల నేతల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మావోయిస్టు చేతిలో హత్యకు గురైన ఊకే రమేష్ తల్లి శాంత, ఊకే అర్జున్ భార్య సావిత్రితో పాటు పోలీసులను అంతమొందించేందుకు మావోయిస్టులు అమర్చిన బాంబులు పేలి కాలు విరిగిన వెంకటాపురానికి చెందిన డర్రా సునీత, ఆమె భర్త మహేష్ మాట్లాడుతూ అమాయకులైన వారిని మావోయిస్టులు అకారణంగా హత్య చేశారని ఆరోపించారు. మావోయిస్టుల దుశ్చర్యల కారణంగా రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌ఫార్మర్ల నెపంతో అమాయకులను మావోయిస్టులు చంపినప్పుడు పౌర హక్కుల నాయకులకు బాధిత కుటుంబాలు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన చల్పాక ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందితే మాత్రం పౌర హక్కులు గుర్తుకు వచ్చాయా? అని మండిపడ్డారు. మావోయిస్టులవే ప్రాణాలు.. తమవి కావా? అని ప్రశ్నించారు.

పౌర హక్కుల సంఘాల తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని దుయ్యబట్టారు. అందరి ప్రాణాలూ ఒక్కటేనని, అందరికీ పౌర హక్కులు ఉంటాయనే విషయాన్ని విస్మరించొద్దని హితవుపలికారు. ఇదిలా ఉండగా పౌరహక్కుల నేతల పర్యటన గోప్యంగా సాగిందని తెలిసింది. వారు ఎప్పుడొచ్చారో.. ఎప్పుడు తిరిగి వెళ్లారో వెల్లడికాలేదు. మావోయిస్టు బాధిత కుటుంబాలు నిరసనకు దిగాయని తెలిసి ఈ గోప్యతను పాటించారని సమాచారం.

సమగ్ర శిక్షా ఉద్యోగుల వినూత్న నిరసన


ములుగులో టీ తయారు చేస్తూ నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 13వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా ఈ ఉద్యోగులు ఆదివారం ములుగులో టీ తయారు చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వస్తే సమగ్రశిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తామని, రాష్ట్ర నాయకులను తెలంగాణ భవన్‌కు పిలిపించి టీ తాగేలోపు జీవో ఇచ్చి పంపిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె ఉధృతంగా కొనసాగుతున్నా సీఎం స్పందించకపోవడం దారుణమని అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించాలని, సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేసి పేస్కేల్ వర్తింపజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి ఉద్యోగికి జీవితబీమా రూ.10లక్షలు, ఆరోగ్య బీమా రూ.5లక్షలు, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని, 61ఏళ్లు నిండినవారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి పాడియా కుమార్, మహిళా అధ్యక్షురాలు జీవనప్రియ, ఉపాధ్యక్షుడు ఎమ్డీ.ఫిరోజ్, సభ్యులు సుజాత, రమేష్, సమన్వయకర్తలు రాజేశ్వరి, ప్రవీణ్, చిరంజీవి, నీలంబాబు, రమేష్, వసంతరావు, సంజీవ, గంగాధర్, సుబ్బారెడ్డి, కల్యాణి, రవికుమార్, ఉమాదేవి, మమత, నరేష్, చందన, శారద పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

ఆత్మకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆటోలో తరలిస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలో జరిగింది. ఆత్మకూరు సీ.ఐ. సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అక్కంపేట సమ్మక్క సారలమ్మ తోరణం వద్ద ఆదివారం పోలీసులు పెట్రోలింగ్‌లో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్ నుంచి పెద్దాపురానికి వస్తున్న ఆటో డ్రైవర్ పోలీసులను చూసి ఆటోను వెంటనే వెనుకకు తిప్పుకుని పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఆటోను తనిఖీలు చేసి అందులో ఉన్న సుమారు విలువ రూ. 27, 500 విలువ గల 1100 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయిని వరంగల్‌కు చెందిన ఎండీ అనిఫ్ వద్ద కొనుగోలు చేసినట్లు ఆటో డ్రైవర్ ఒర్రె వంశీకృష్ణ ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆటోను సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్సై అశోక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పులి జాడ కోసం అడవిలో వెతుకుతున్న ఫారెస్టు సిబ్బంది

లవ్వాల అడవుల్లో పెద్దపులి

తాడ్వాయి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలంలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం మళ్లీ వెలుగుచూసింది. లవ్వాల అడవుల్లో పులి పాదముద్రలను అటవీశాఖ అధికారులు ఆదివారం గుర్తించారు. రేంజ్ అధికారి సత్తయ్య డిప్యూటీ రేంజర్ శ్రీనివాస్, సెక్షన్ అధికారి సందీప్ ఆధ్వర్యంలో సిబ్బంది పులి కదలికలపై నిఘా పెట్టారు. రెండురోజులుగా పులి సంచరిస్తున్నట్లు తెలుసుకొని లవ్వాల అటవీ ప్రాంతంలో గాలించగా పలుచోట్ల దాని పాదముద్రలు లభ్యమయ్యాయి. కొడిశాల, లింగాల, లవ్వాల గ్రామ ప్రజలు అడవిలోకి వెళ్లవద్దని అధికారులు సూచించారు.

పద్మశాలీలు అభివృద్ధి చెందాలి

పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలకమారి వెంకటేశ్వర్లు


కేసముద్రంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కేసముద్రం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలీలు ఐకమత్యంతో రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మహబూబాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలకమారి వెంకటేశ్వర్లు సూచించారు. కేసముద్రంలో ఆదివారం పద్మశాలి సంఘం విస్తృతస్థాయి సమావేశం ఆ సంఘం మండల అధ్యక్షుడు సామల నర్సయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీలు రాజకీయశక్తిగా ఎదిగేందుకు ఐకమత్యంతో ఒకరికొకరు సహకరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సామల ఉపేందర్, అనుమాండ్ల సమ్మయ్య, మామిడాల శ్రీనివాస్, చలమల్ల కిరణ్, సామల రమేష్, అందె సాంబయ్య సామల లింగమూర్తి, మాద కుమార్, కుసుమ సాంబమూర్తి, గుండు శ్రీనివాస్, శంకర్‌లింగం పాల్గొన్నారు.

29న జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 22 : (ఆంధ్రజ్యోతి) తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ ఆధ్వర్యంలో ఈ నెల 29న హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-17బాలబాలికల విభాగంలో క్రీడా పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 90595 22986 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

సంఘాలు వ్యతిరేకిస్తే

సీపీఎస్ అమలయ్యేదా ?

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవస్థీకృత సంఘాలు వ్యతిరేకిస్తూ ఆనాడు కాంట్రిబ్యూటెడ్ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) అమలయ్యేదా అని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం (టీఎస్ సీపీఎస్ ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ ప్రశ్నించారు. వరంగల్ ఇస్లామియా కళాశాల గ్రౌండ్‌లో సీపీఎస్ ఉద్యోగులు సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్‌కుమార్ అధ్యక్షతన సీపీ ఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కాక తీయ కదన భేరి బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. రాష్ట్రం లో ని 147 సంఘాల వైఫల్యమే నేడు ఉద్యోగ, ఉపాధ్యాయుల నెత్తిమీద సీపీఎస్ పెనుభూతంగా తాండవిస్తుందన్నారు. సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆవేదన నుంచే టీఎస్‌సీపీఎస్‌ఈయూ పుట్టిందన్నారు. కేవలం సీపీఎస్ పంతమే లక్ష్యంగా టీఎస్‌సీపీఎస్‌ఈయూ పనిచేస్తుందన్నారు. 2016లో సం ఘం ఆవిర్భావం వరకు అప్పటికే రాష్ట్రంలో వ్యవస్థీకృతమైన సంఘాలకు సీపీఎస్ అంశం గుర్తుకురాలేదన్నారు.

సీపీఎస్ ఉద్యోగులను సంఘాలన్నీ వాటి అవసరాలకు వాడుకున్నారని ఆరోపించారు. సీపీఎస్ ఉద్యోగులు సంఘాల నాయకులకు పల్లకీలు మోసే బోయల్లాగానే కనిపించారన్నారు. రాష్ట్రంలో గ్రాట్యూటీ, ఫ్యామిలీ పెన్షన్ తెచ్చిన ఘనత టీఎస్‌సీపీఎస్ ఈయూదేనన్నారు.

విద్యుదాఘాతంతో పోస్ట్ మన్ మృతి


అబ్బాస్ అలీ (ఫైల్)

నెల్లికుదురు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పోస్ట్‌మన్ మృతి చెందిన ఘటన రాజుల కొత్తపెల్లిలో ఆదివారం జరిగింది. ఎస్సై సీహెచ్. రమేష్‌బాబు కథనం ప్రకారం. మహ్మద్ అబ్బాస్ అలీ (59) రాజులకొత్తపల్లిలో పోస్ట్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన ఇంటిపై కోతులు ఎగరడంతో రేకులు కిందికి జారాయి. రేకులను సరి చేస్తుండగా విద్యుత్ తీగలు తెగిపడటంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య మహ్మద్ యాకూబ్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


తేజావత్ శ్రీను (ఫైల్)

సీరోలు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం కాంపల్లి శివారు సక్రాంనాయక్ తండాకు చెందిన తేజావత్ శ్రీను (38) అనే రైతు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం. సక్రాంనాయక్ తండాకు చెందిన శ్రీనుకు ఎకరం భూమి ఉంది. అందులో కొంత మిరపతోట వేయగా, దాని పెట్టుబడి కోసం రూ.2 లక్షలు అప్పు చేశాడు. తోటకు రోగాలు ఆశించడంతో తెచ్చిన అప్పు ఎలా తీర్చాలన్న మనస్థాపంతో ఈనెల 21న చేనువద్ద పురుగుల మందుతాగి ఇంటికి వచ్చి పడుకున్నాడు. భార్య మంగమ్మ కూలీ పనికిపోయి ఇంటికి వచ్చే సరికి శ్రీను వాంతులు చేసుకుంటుండగా, పురుగులమందు వాసనను గుర్తించారు. శ్రీనును వెంటనే రాత్రి 7 గంటలకు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై నగేష్ తెలిపారు. మృతుడి సోదరుడు సక్రు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమార్తె గాయత్రి ఉన్నారు.

పర్యాటకంపై నిర్లక్ష్యం

- అభివృద్ధికి నోచుకోని హేమాచల గడీ గుట్టలు
- ట్రెక్కింగ్ ఏర్పాటునకు గతంలో సన్నాహాలు
- ప్రతిపాదనలు మరిచిన టూరిజం అధికారులు


ట్రెక్కింగ్ నిర్వహిస్తున్న టూరిజం అధికారులు (ఫైల్)

మంగపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మంగపేట మండలంలోని హేమాచల కొండలకు ఆనుకొని ఉన్న రమణక్కపేట వద్ద గడీల గుట్ట ప్రాంతాన్ని ట్రెక్కింగ్ స్పాట్‌గా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు మోక్షం కలగడం లేదు. ఐదున్నర ఏళ్లుగా ఇది మగ్గుతూనే ఉంది. 2019 మే 31న తెలంగాణ టూరిజం శాఖ డీఈ రామకృష్ణ, ఏకో టూరిజం జిల్లా కో ఆర్డినేటర్ కల్యాణపు సుమన్ ఆధ్వర్యంలో అప్పటి టూరిజం ఏఈ రుష్వీత్, ఎకోక్లబ్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి సాజిద్ తదితరులు స్థానిక ఫారెస్ట్ బీట్ బేస్‌క్యాంప్ సిబ్బందితో కలిసి రమణక్కపేట శివారులోని గడీల గుట్టపై ట్రెకింగ్ నిర్వహించారు. గడీల గుట్టపై ఉన్న పురాతన రాతి గోడను ఆది మానవుల సమాధులను పరిశీలించారు. గుట్టను పర్యాటకంగా ఎలా అభివృద్ధి చేయొచ్చనే అంశాన్ని పరిశీలించారు. ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు వస్తున్న క్రమంలో వారి కోసం ట్రెక్కింగ్ రూట్‌తోపాటు వాచింగ్ టవర్ నిర్మాణం తదితర సౌకర్యాలను కల్పించాలని నిర్ణయించారు. దీనిపై జిల్లా అధికారుల సలహాలు, సూచనలు సేకరించి టూరిజం శాఖ మేనేజింగ్ డైరెక్టర్‌కు నివేదిక ఇస్తామని టూరిజం శాఖ డీఈ రామకృష్ణ, ఏకో టూరిజం జిల్లా కో ఆర్డినేటర్ సుమన్ తెలిపారు. అది నేటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రతిపాదన తయారై ఏళ్లు దాడినా ట్రెక్కింక్ ఏర్పాటు ప్రక్రియకు ముందడుగు పడలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గడీల గుట్టను ట్రెక్కింగ్ స్పాట్‌గా ఏర్పాటు చేసి తమ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇప్పటికైనా స్పందించాలి



రమణక్కపేట వద్ద ఉన్న గడీల గుట్టను ట్రెకింగ్ స్పాట్‌గా మార్చడం కోసం టూరిజం శాఖ ప్రతిపాదనలు చేసి ఐదున్నర ఏళ్లు గడుస్తోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి దీనికి కార్యరూపం దాల్చాలి. ఈ ప్రాంతం పర్యాట కంగా అభివృద్ధి చెందితే స్థానికులకు వ్యాపారపరంగా ఉపాధి లభిస్తుంది.

మంచెర్ల వెంకటేశ్వర్లు, స్థానికుడు

సైకిల్ పైనే డైన

➡ తగ్గుతున్న వినియోగం
➡ కనుమరుగవుతున్న షాపులు
➡ సైక్లింగ్ ఆరోగ్యదాయకం

ఎక్కడికి వెళ్లిన సైకిల్ పైనే..

గొల్లూరి యాదయ్య, తొర్రూరు



సరుకుల కోసం పాలకుర్తికి సైకిల్‌పైనే పోత. కూలీ, వ్యవసాయ బావి వద్దకు వెళ్లాలన్నా సైకిల్ మీదనే వెళ్తంట. 40 ఏండ్ల నుంచి సైకిల్ వాడుతున్న. నాకు ఇప్పటికి ఎలాంటి జబ్బులు లేవు. ఆరోగ్యంగా ఉన్న. సైకిల్ వాడని రోజు లేదు. నాకు మోటర్ సైకిల్ ఉంది. అయినా సైకిలే వాడతాను.

పాలకుర్తి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇరవై ఏండ్ల క్రితం ప్రయాణానికి సైకిల్ ప్రధాన సాధనంగా ఉండేది. దూరం ఉన్న ఊర్లకు కూడా సైకిల్ పైనే ప్రయాణం చేసే వాళ్లు. ఆ సైకిల్ కనుమరుగయ్యే పరిస్థితికి వచ్చింది. అదేవిధంగా సైకిల్‌పై ప్రయాణిస్తే శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసానికి దోహదపడుతుంది. ఇబ్బడి ముబ్బడిగా బైక్‌లు, కార్లు, ఇతర వాహనాలు మార్కెట్‌లోకి రావడంతో సైకిల్ ప్రాధాన్యత రోజు రోజుకు తగ్గిపోతోంది. దీంతో శారీరక శ్రమ తగ్గి రోగాలు కూడా అదే రీతిలో పెరిగిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వ్యవసాయం కోసం సైకిళ్లను ఇప్పటికి వినియోగిస్తున్నారు. కొంత మంది సైకిల్‌పైనే పట్టణాలకు వస్తూ వారికి కావాల్సిన నిత్యావసర సరుకులను తీసుకువెళ్తున్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందినా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఇంకా సైకిల్‌పైనే ప్రయాణం చేస్తున్న వారు అనేక మంది ఉ న్నారు. 60, 70 ఏండ్ల వృద్ధులు ఇప్పటికి సైకిల్‌పై ప్రయాణం చేస్తున్నారంటే ఎంత ఆరోగ్యంగా ఉంటున్నారో అర్థం చేసుకోవచ్చు.



సైకిల్ రిపేరు చేస్తున్న మెకానిక్

20 ఏళ్ల క్రితం కిరాయికి సైకిళ్లు

ఇరవై ఏండ్ల క్రితం సైకిల్ స్టాండ్లు ఉండేవి. ఒక్కో సైకిల్‌ను గంటకు రూ. 50 పైసల నుంచి రూ. 3 వరకు కిరాయికి ఇచ్చేవారు. కొంత మంది రోజు లెక్కన రూ. 15 తీసుకొని సైకిల్‌ను కిరాయికి ఇచ్చేవారు. మరికొంత మంది షాపుల యాజమానులు 6 నెలలు, ఏడాది వరకూ కిరాయికి ఇచ్చేవారు. రాత్రి ప్రయాణం చేయడానికి సైకిల్‌కు డైనమో బిగిస్తే లైట్ వెలిగేది. అటువంటి సైకిళ్ల కిరాయికి అందుబాటులో ఉండేవి. ఇప్పుడు సైకిళ్లను కిరాయికి తీసుకునే వారు లేక స్టాండ్లు కనుమరుగయ్యాయి. కిరాయికి ఇచ్చే వారు ప్రత్నామ్నాయ పనులు వెతుకున్నారు.

50 ఏండ్ల నుంచి సైకిల్‌తోనే సహవాసం

అనుముల బుచ్చయ్య, ఈరవెన్ను



ప్రతి రోజు వ్యవసాయ బావి వద్దకు సైకిల్‌పైనే వెళ్తా. గ్రామంలో ఏ చిన్న పనికి వెళ్లాలన్న సైకిలే. దాదాపు రోజుకు 10 కిలోమీటర్లు సైకిల్ మీద తిరుగుతా. నేను 72 ఏండ్ల వయసున్న. ఇప్పటికి ఎలాంటి కాళ్లు, కీళ్ల నొప్పులు లేవు. సైకిల్ తొక్కుతూ ఆరోగ్యంగా ఉన్నా.

అల్లుడికి కట్నంగా సైకిల్

1980 నుంచి 2000 సంవత్సరాల మధ్య కాలంలో సైకిళ్ల హవా కొనసాగింది. కూతురు వివాహం చేస్తే అల్లుడికి కట్నం కింద కొంత నగదుతో పాటు సైకిల్‌ను ఇచ్చేవారు. పలు కంపెనీలకు సంబంధించిన సైకిళ్లకు మంచి క్రేజీ ఉండేది. అత్యధిక శాతం మంది ఆనాడు పిలిప్స్ సైకిల్‌ను ఇష్టపడేవారు. నాణ్యంగా ఉంటుందని ఆ సైకిల్‌నే కట్నంగా అడిగేవారు. ఇప్పటికి ఆ సైకిళ్లు అక్కడక్కడ కనిపిస్తాయి.

30 ఏండ్ల నుంచి షాపు నడుపుతున్న..

దేవగిరి శ్యాంప్రసాద్, పాలకుర్తి



ముప్పై ఏండ్ల నుంచి సైకిల్ షాపు నడుపుతున్నా. ఇరవై ఏండ్లు షాపు బాగా నడిచింది. సైకిల్‌ను గంటకు ఒక రూపాయి నుంచి రూ. 3 వరకు ఇచ్చేది. కొంత మంది రోజు లెక్కన కిరాయికి తీసుకు వెళ్లేవారు. రోజుకు రూ. 15 తీసుకునేవాళ్లం. 30 సైకిళ్లు కిరాయికి ఇచ్చేది. రోజుకు రూ. 300 నుంచి రూ. 500 వరకు సంపాదించేవాడిని. బండ్లు (బైక్) బాగా పెరిగాయి. సైకిల్ వాడే వారు లేరు. పదేళ్ల నుంచి గిరాకి తగ్గింది.

భరోసా..భయం

(5వ పేజీ తరువాయి)

పెట్టుబడి సాయాన్ని అందించనుంది. అయితే సాగులో లేని భూములతో పాటు మరికొన్ని వర్గాలకు కూడా రైతు భరోసాలో కోత పెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందనే టాక్ వినబడుతుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ నిధి పథకం ద్వారా రైతులకు మూడు విడతల్లో రూ.6 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తుంది. అయితే ఈ పీఎంకే నిధి పథకానికి కేంద్రం అనేక నిబంధనలను అమలు చేస్తుంది.

ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఆదాయ పన్ను చెల్లిస్తున్నవారు, ఇంజనీర్లు, వైద్యులు, న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్ట్‌లు తదితర వర్గాలకు పీఎంకే నిధి పథకాన్ని అందించటం లేదు. ఇదే విధానాన్ని రైతు భరోసాకు కూడా వర్తింప చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతుబంధు పథకం ద్వారా 8,89,787మంది రైతులు లబ్ధి పొందుతున్నారు.

వీరికి గత యాసంగిలో ఎకరాకు రూ.5వేల చొప్పున ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందించింది. అయితే పీఎంకే నిధి పథకం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 3,81,890 మంది రైతులు మాత్రమే లబ్ధి పొందుతున్నారు. పీఎంకే నిధి కంటే 5,07,897 మంది రైతులు అదనంగా రైతుబంధు పొందుతున్నారు. అయితే ప్రభుత్వం పీఎంకే నిధి మార్గదర్శకాల్లో కొన్నింటినైనా అమలు చేసినా సగం మందికి రైతు భరోసా దక్కకుండా పోతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నేడు దత్తక్షేత్రంలో అనఘాష్టమి వ్రతాలు

వరంగల్ కల్చరల్, డిసెంబరు 22 : మార్గశిర మాసం బహుళాష్టమి రోజున ప్రధానమైన అష్టమిగా నిర్వహిస్తూ ప్రతీ సంవత్సరం దేశవ్యాప్తంగా దత్త భక్తులు అనఘాష్టమి వ్రతాన్ని సోమవారం నగరంలోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో వెయ్యి మందితో సామూహిక శ్రీఅనఘాష్టమి వ్రతాలను నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్‌జీఎస్ దత్తజ్ఞాన బోధ సభ ట్రస్టు సభ్యులు వైవీ వామన్‌రావు తెలిపారు. ప్రధాన అనఘాష్టమి రోజున దంపతులు లేదా ఒక్కరు, పెళ్లికాని వారు, భర్త లేనివారు, ఎవరైనా ఈ వ్రతాన్ని ఆచరించుకోవచ్చని తెలిపారు. ఆరోగ్యం, ఐశ్వర్యం, వివాహం కాని వారు ఈ వ్రతాన్ని ఆచరించుకుంటే విశేష ఫలితాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.



భక్తులందరి చేత దత్త ప్రచారక్ కొక్కుల రాజేంద్రప్రసాద్ వ్రతాన్ని ఆచరింప చేస్తారని, వ్రతం అనంతరం భక్తులందరికి మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు భక్తులందరు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆచరించుకోవాలని వామన్‌రావు తెలిపారు.

పంట క్షేత్రంలో నిఘా నేత్రం



మండలంలోని తిమ్మంపేటలో వ్యవ సాయ పంట క్షేత్రంలో పంటల రక్షణ కోసం ఓ రైతు సోలార్ ద్వారా నిఘానేత్రం (సీసీ కెమెరా) ఏర్పాటు చేశారు. వ్యవసా య పంట భూమిలో సాగుచేసిన పంటలకు, వ్యవసాయ పనిముట్ల రక్షణగా ఉండడానికి సీసీ కెమెరాను ఏర్పాటు చేసిన దృశ్యం 'ఆంధ్రజ్యోతి' కంటపడింది. రైతులు పంట భూమిలో సీజనల్ పంటలు సాగు చేయడంతో పాటు పండిన పంటలు అమ్ముకునే వరకు పంట భూమి దగ్గరనే ఉంచుతారు. మిరప పంట సాగు చేసిన తర్వాత వరుగు కావడానికి కల్లంలో ఆరబోస్తారు. నిఘా నేత్రాలతో పంటలకు భద్రతగా ఉంటుంది.

దుగ్గొండి (ఆంధ్రజ్యోతి)

'సెంచరీ' కొట్టేసిన బామ్మ

కుటుంబంతో కలిసి వందేళ్ల పుట్టిన రోజు వేడుకలు



పుట్టిన రోజు సందర్భంగా కొడుకులు, కూతుళ్లతో శ్యామక్క

గణపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గడ్డమీది శ్యామక్క 'సెంచరీ' కొట్టేసింది. వందేళ్ల పూర్తి చేసుకున్న ఆమె తన పుట్టిన రోజు వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసిజరుపుకుంది. కొడుకులు, కూతుళ్లు, మనవళ్లు, మనవరాళ్లు, మునిమనవళ్లు, మునిమనవరాళ్ల మధ్య ఈ వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. తన బలగం మధ్య శ్యామక్క కేక్ కట్ చేసి అందరికీ తెలిపించింది. ఆమెకు నలుగురు కొడుకులు, ఒకకూతురు సంతానం కాగా ఎనిమిది మంది మనవళ్లు, ఎనిమిది మంది మనుమరాళ్లు, ఆరుగురు మునివవళ్లు, నలుగురు మునిమనుమరాళ్లు ఉన్నారు. పెద్ద కుమారుడి వయసు 82 ఏళ్లు కాగా అందరి కంటే చిన్నదైన మునిమనుమరాలి వయసు ఐదేళ్లు. వీరంతా శ్యామక్క పుట్టిన రోజు వేడుకలో పాల్గొని ఆమె ఆశీర్వాదం తీసుకున్నారు. వందేళ్లు పూర్తయినా శ్యామక్క ఇంకా ఆరోగ్యంగానే ఉంది. తన పని తాను చేసుకుంటూ ఆనందంగా జీవిస్తోంది. ఆమె ఇంకా నూరేళ్ల జీవించాలని పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న వారు ఆకాంక్షించారు.

శ్రీరామదూత శిరసా నమామి

» పాల్గొన్న వెయ్యి మంది మహిళలు
» అలరించిన అతివల కోలాటం
» గిన్నీస్ కెక్కిన కొప్పూర్



కొప్పూర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద హనుమాన్ చాలీసా మహా కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు



నృత్యం చేస్తున్న చిన్నారి

భీమదేవరపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ చాలీసా మహా కోలాట బృందం ప్రదర్శన స్పిరిచ్‌వల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నమోదైంది. ఆదివారం భీమదేవరపల్లి మండలం కొప్పూర్ పంచముఖ అంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా మహిళ కోలాట ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వెయ్యి మంది మహిళలు పాల్గొని స్పిరిచ్‌వల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును నమోదు చేశారు. గతంలో 420 మంది మహిళల పేరిట ఉన్న రికార్డును కొప్పూర్ పంచముఖ అంజనేయస్వామి ఆలయంలో మహిళలు తిరగరాశారు. సుమారు 11 నిమిషాల పాటు సాగిన హనుమాన్ చాలీసా కోలాట బృందం ప్రదర్శనను నేషనల్ కో-ఆర్డినేటర్ లయన్ వెంకటరమణరావు ప్రత్యేక్షంగా తిలకించి స్పిరిచ్‌వల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుగా నమోదైందని ప్రకటించారు. అనంతరం ధ్రువీకరణ పత్రాన్ని నిర్వాహకులకు అందజేశారు. కొప్పూర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం 12వ వార్షికోత్సవం సందర్భంగా ఒక కొత్త కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆలయ చైర్మన్ కాసం రమేష్ గుప్తా భావించారు. తేజస్వి డ్యాన్స్ అకాడమీ చైర్మన్ శ్వేత, కొప్పూర్ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం సంయుక్త ఆధ్వర్యంలో స్పిరిచ్‌వల్ హనుమాన్ చాలీసా మహా కోలాట బృందం ప్రదర్శన నిర్వహించాలని భావించారు. గిన్నిస్ బుక్ రికార్డు కోసం గత రెండు నెలలుగా తీవ్రంగా శ్రమించారు. తెలంగాణతో పాటు, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, నెల్లూర్ తదితర ప్రాంతాల నుంచి మహిళలకు హనుమాన్ చాలీసా కోలాటంపై శ్వేత క్లాస్‌లు నిర్వహించారు. ఆదివారం సుమారు వెయ్యి మంది మహిళలు మహా కోలాట ప్రదర్శనలో పాల్గొని గిన్నిస్ బుక్ రికార్డును సొంతం చేసుకున్నారు. వారందరి కరతాళ ధ్వనుల మధ్య గిన్నిస్ బుక్ రికార్డును నిర్వాహకులు నేషనల్ కో-ఆర్డినేటర్ వెంకటరమణరావు చేతుల మీదుగా అందుకున్నారు. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, ఆలయ చైర్మన్ కాసం రమేష్ గుప్తా, శ్వేత, మాజీ జడ్పీటీసీ వంగ రవీందర్, ఆలయ అర్చకుడు ఉపేందర్‌శర్మ, చిట్టంపల్లి అయిలయ్య, గద్ద సమ్మయ్య, గద్ద సంపత్, కొమురవెల్లి చంద్రశేఖర్‌గుప్తా, గూటం జోగిరెడ్డి, మాచర్ల కుమారస్వామి, అంచూరి సదానందం, జ్ఞానేశ్వర్, తనుకు వెంకటేష్, రమాదేవి, తిరుపతి, జైపాల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు నేషనల్ కో-ఆర్డినేటర్ వెంకటరమణరావు మాట్లాడుతూ కళలను వెలికితీసేందుకే గిన్నిస్ బుక్ రికార్డులను నమోదు చేస్తున్నామని అన్నారు. భారతీయ కళలను ప్రోత్సహించడం, ప్రతిభను వెలికి తీయడం లాంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల ఎంతో మంది ప్రతిభ ఉన్నవారు బయటకు వస్తున్నారన్నారు.

ఏజెన్సీలో మంచు దుప్పటి

పొంగమంచుతో రాకపోకలకు ఇబ్బందులు

కొత్తగూడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ కొత్తగూడ మండలాన్ని ఆదివారం మంచు దుప్పటి కప్పేసింది. ఏజెన్సీలో చలి తీవ్రత పెరుగుతుంది. మంచు కప్పేయడంతో ఉదయం రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



కొత్తగూడ గ్రామాన్ని ముంచేసిన మంచు

చీరెలతో రక్షించినారు..



తీవ్ర చలితో నారు పాడైపోతుందని భావించిన ఇప్పగూడెం గ్రామానికి చెందిన రైతు తుపాకుల వెంకటేశ్వర్లు వరి నారుకు చుట్టూరా చీరెలను రక్షణగా ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా రైతు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా తీవ్రచలి ఉండడంతో పాటు, కోళ్లు, పందులు వచ్చి నారుమడిలో విత్తనాలను నాశనం చేయకుండా రక్షణగా ఉంటాయని చీరెలన ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

-స్టేషన్‌ఘన్‌పూర్(ఆంధ్రజ్యోతి)

మౌన ముని.. మన్నించు

» పీవీ విజ్ఞాన వేదికలో పూర్తి కాని అభివృద్ధి పనులు
» 15 కోట్లతో గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు
» కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా అభివృద్ధి పనులు పూర్తయ్యేనా ?
» నేడు పీవీ 20వ వర్ధంతి



వంగరలోని పీవీ ఇల్లు

భీమదేవరపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పీవీ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా వంగరలోని పీవీ విజ్ఞాన వేదికలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో అర్ధాంతరంగా ఆగిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా ఇప్పటికీ వంగరలో పీవీ విజ్ఞాన వేదిక వద్ద పనులు పూర్తి కాలేదు. ప్రహరీగోడ నిర్మించినా పీవీ విజ్ఞాన వేదికలోకి పశువులు, గొర్రెలు వెళ్లి మేత మేస్తున్నాయి. దక్షిణ భారతదేశం నుంచి దేశ ప్రధానిగా మొట్ట మొదటిగా ఎన్నికైనా పీవీకి ఆయన మరణానంతరం కాంగ్రెస్ పార్టీ సరిగ్గా పట్టించుకోలేదని బీఆర్ఎస్ పార్టీ పేర్కొంది. తెలుగోడు... తెలంగాణలో జన్మించిన పీవీకి కీర్తి ప్రతిష్టలు తెచ్చే విధంగా ఆయన శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పట్లో ప్రకటించారు. ఆయన జన్మస్థలమైన వంగరను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని అప్పుడే పీవీకి నిజమైన నివాళి ఇచ్చినట్లు అవుతుందని కేసీఆర్ స్వయంగా ప్రకటించారు. 2021లో పీవీ శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. భీమదేవరపల్లి మండలంలోని వంగరలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ. 15 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనుల కోసం అరకొరగ నిధులు విడుదల చేయడంతో పనులు నెమ్మదిగా ప్రారంభించారు.

వంగరలో అర్ధాంతరంగా ఆగిన పనులు

పీవీ విజ్ఞాన వేదికలో పలు అభివృద్ధి కార్యక్రమాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. జ్ఞాన వేదికలో ఆడిటోరియం, పీవీ జీవిత చరిత్రను ప్రజలకు తెలియజేసే విధంగా ఏర్పాటు చేసిన ఓపెన్ థియేటర్, పీవీ వాడిన వస్తువులు, పీవీ మ్యూజియం, అధ్యాత్మిక కేంద్రం, ఆర్ట్ గ్యాలరీ, పీవీ విగ్రహం ఏర్పాటు దాని చుట్టూ పార్క్ ఏర్పాటు ఇలాంటి కార్యక్రమాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. రూ. 11కోట్లతో చేపట్టిన పనులు ఇప్పటికే నత్తనడకన సాగుతుండడంతో పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వంగర సమ్మక్క బోటి నుంచి వంగర పీవీ జ్ఞాన వేదిక వరకు రూ. 4కోట్లతో చేపట్టాల్సిన డబుల్ రోడ్‌కు ఇప్పటి వరకు రూపాయి బిళ్లకు రాలేదు. ఒక్క అభివృద్ధి పని కూడా పూర్తికాలేదు.




వంగరలో ఏర్పాటు చేసిన పీవీ విగ్రహం

నేడు వంగరలో వర్ధంతి

2004డిసెంబరు 23న పీవీ కన్ను మూశారు. మండలంలోని వంగరలో సోమవారం పీవీ 20వ వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు పీవీ సోదరుడి కుమారుడు పీవీ మదన్‌మోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు హాజరవుతారన్నారు.



పీవీ విజ్ఞాన వేదికలో మేస్తున్న గొర్రెలు



డేటాకు టాటా!

హెల్త్ ప్రొఫైల్ ఏమైంది ?!

- గత ప్రభుత్వంలో పైలెట్ ప్రాజెక్టుగా ఆరోగ్య సర్వే
- ప్రజలకు చేరని రిపోర్టులు
- రెండేళ్లుగా ఉపయోగపడని సమాచారం
- ఫ్యామిలీ డిజిటల్ కార్డు జారీకి కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాహం



హెల్త్ ప్రొఫైల్ సర్వేలో రక్తనమూనాల సేకరిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)



ములుగులోని తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్

ములుగు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పౌరుల సమగ్ర ఆరోగ్య సమాచార సేకరణ ద్వారా అత్యవసర సమయాల్లో వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలనే లక్ష్యంతో గతంలో చేపట్టిన హెల్త్ ప్రొఫైల్ సర్వే ఫలాలు ప్రజలకు నేటికీ అందలేదు. ములుగు, సిరిసిల్ల జిల్లాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని అప్పట్లో ఇంటింటి సర్వే చేశారు. ఆతర్వాత తలెత్తిన సాంకేతిక లోపాలు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా రెండేళ్లుగా డేటా మూలకుపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి ముందుకు వచ్చింది. ఇందులో కుటుంబంలోని ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్‌ను పొందుపర్చాలని నిర్ణయించింది. అయితే.. గతంలో సేకరించిన రిపోర్టులను ఉపయోగించుకుంటారా.. లేక కొత్తగా పరీక్షలు చేస్తారా? అసలు ఆ వివరాలు సర్వర్‌లో ఉన్నాయా? అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి.

2022లో మూడు నెలలపాటు సర్వే

నిజానికి దేశవ్యాప్తంగా ప్రజల హెల్త్ ప్రొఫైల్‌ను తయారు చేసేందుకు గత కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. జనాభా తక్కువగా ఉన్న చిన్న జిల్లాలు.. ముఖ్యంగా ఆదివాసీలు, గిరిజనులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ప్రయోగాత్మకంగా ఎంపికచేసే క్రమంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చిన్న జిల్లాలైన ములుగు, సిరిసిల్లలో 2022 మార్చి 5న ప్రారంభించింది. సిరిసిల్ల జిల్లాలో 230 బృందాలు, ములుగు జిల్లాలో 153 బృందాలను నియమించారు. 18 ఏళ్లు పైబడిన వారి నుంచి రక్తనమూనాలను తీసుకోవడంతోపాటు ఆధార్, ఫోన్ నెంబర్ వంటి వివరాలను సేకరించారు. ములుగు జిల్లాలో 2లక్షల 85వేల మంది, సిరిసిల్లలో 4 లక్షల 20వేల మంది ఉండగా.. మూడు నెలల పాటు సర్వే జరిగింది. కొంతమంది బతుకుదెరువు కోసం వేరే ప్రాంతాలకు వెళ్లడం, స్థానికంగా ఉన్నప్పటికీ చాలామంది రక్త నమూనాలు, సమాచారం ఇచ్చేందుకు ముందుకు రాకపోవడంతో 85 శాతంతో సర్వేను ముగించారు. ఇదే సమయంలో జిల్లాల వారిగా టీ.డయాగ్నో హబ్‌లు ఏర్పాటయ్యాయి. అక్కడే బ్లడ్ శాంపిళ్లకు గ్రూపింగ్‌తో పాటు 50కిపైగా వివిధ పరీక్షలు జరిపారు.

బయటపడ్డ దీర్ఘకాలిక వ్యాధులు

ఈ సర్వేలో చాలామందికి ఉన్న దీర్ఘకాలిక వ్యాధులు వెలుగు చూశాయి. ఇరు జిల్లాల్లో కలిపి థైరాయిడ్ సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య 28,897కాగా, 44,20మంది కాలేయ సంబంధ రుగ్మతతో ఉన్నట్లు తేలింది. 15,605మందికి యూరిక్ యాసిడ్, 93,571మందికి కొలెస్ట్రాల్, 18,955మందికి షుగర్, 26,453మందికి కిడ్నీ, 56,721మందికి కాల్షియం, 22,540మందికి పాంక్రియాజ్ సమస్య ఉన్నట్లు తేలింది. వీరిలో కొందరు మాత్రమే అప్పటికే ఆ వ్యాధుల నిర్ధారణ జరిగి చికిత్స పొందుతున్న వారు కాగా.. చాలామందికి ఈ పరీక్షల ద్వారా అంతర్గతంగా ఉన్న రోగం బయటపడింది.

అస్తవ్యస్తంగా సమాచారం

కుటుంబాల వారిగా సమాచార సేకరణ నిర్దిష్ట పద్ధతిలో జరగలేదు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డును మొబైల్ నెంబర్‌తో లింక్ చేయడం ద్వారా ఆరోగ్య సమాచారాన్ని భద్రపర్చాల్సి ఉంది. ఈ వివరాలను కుటుంబంలోని ఒకరి ఫోన్ నెంబర్‌కు మెస్సేజ్ రూపంలో పంపించాలని, యూనిక్ ఐడీలతో కార్డులను కూడా జారీ చేయాలని భావించారు. ప్రత్యేకంగా టెక్నికల్ సిబ్బందిని నియమించారు. కానీ, గడువులోగా స్క్రీనింగ్ పూర్తిచేయాలనే హడావుడిలో ఒత్తిడికి గురైన సిబ్బంది క్షేత్రస్థాయిలో అనేక పొరపాట్లు చేశారు. ఒకే ఫోన్ నెంబర్‌పై వందలమంది వివరాలను ఎంటర్ చేశారు. ఆధార్ నంబర్లను సరిగ్గా నమోదు చేయలేదు. పీహెచ్‌సీల వారిగా ప్రజల సమాచారాన్ని పొందుపర్చి ప్రత్యేకంగా లాగిన్ ఐడీలు, పాస్‌వర్డ్‌లు ఇవ్వాల్సి ఉంది. కానీ, ఇవేమీ చేయలేదు. దీంతో కోట్ల రూపాయలు ఖర్చుచేసి.. వందలాది మంది సిబ్బందిని నియమించి సేకరించిన హెల్త్ రిపోర్టు ప్రహసనంగా మారింది. డేటా అంతా ఎక్కడుందో..? ఏమైందో తెలియని పరిస్థితి. ఇదిలా ఉంటే మొబైల్ నెంబర్‌లకు మెస్సేజ్‌ను సెండ్ చేయడంతోపాటు ప్రొఫైల్‌ను ప్రింట్‌తీసి గ్రామాల వారిగా పంపిణీ చేసే ప్రక్రియ కూడా జరిగింది. ఇందుకోసం రెవెన్యూ శాఖ సహాయం తీసుకున్నారు. కానీ, ఇది 30శాతం కూడా నెరవేరలేదు. ఇంటిపేర్లు లేకపోవడం, వ్యక్తుల పేర్లలో తప్పులు దొర్లడంతో ఏ రిపోర్టు ఎవరిదో తెలియక పంపిణీని నిలిపివేశారు. కార్డుల జారీ అసలే జరగలేదు. అత్యవసర వైద్యసేవల కోసం ఆస్పత్రులకు వెళ్లే వారి బ్లడ్ గ్రూప్, వారికి ఉన్న దీర్ఘకాలిక వ్యాధుల సమాచారం తెలియక వైద్యులు మళ్లీ పరీక్షలు చేయిస్తున్నారు. ఫలితంగా హెల్త్ ప్రొఫైల్ సర్వే ఎందుకూ పనికిరాకుండా పోయింది.

డయాగ్నో కేంద్రాల్లో సమస్యలు

కోట్లాదింూపాయల విలువైన యంత్రాలతో ఏర్పాటుచేసిన తెలంగాణ డయాగ్నోస్టిక్ కేంద్రాలు సరైన సేవలు అందించడంలేదు. నైపుణ్యమున్న ల్యాబ్ టెక్నీషియన్‌లు, టెక్నికల్ సిబ్బంది కొరతకు తోడు సాంకేతిక సమస్యలు వేధిస్తున్నాయి. ములుగులోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలోని సెంటర్‌లో ఆరునెలల క్రితం సాంకేతిక సమస్య ఎదురైంది. ఎలుకలు కొరకడంతో కేబుళ్లు ధ్వంసమయ్యాయి. అప్పటి నుంచి పరీక్షలు సరిగ్గా జరగడంలేదు. నిత్యం ఆస్పత్రికి వందలాది మంది అనారోగ్య సమస్యలతో వస్తుండగా వారి నుంచి సేకరించిన రక్త, ఇతర శాంపిళ్లను వరంగల్‌కు తరలించి పరీక్ష చేయిస్తున్నారు. రోగ నిర్ధారణ జరగడానికి ఒక్కోసారి రెండుమూడు రోజులు పడుతుండటంతో రోగులకు సకాలంలో సరైన వైద్యం అందడంలేదు. హెల్త్‌ప్రొఫైల్ సర్వేకంటే ముందు రాష్ట్ర ప్రభుత్వం డయాగ్నో కేంద్రాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని దుప్పి మృతి



దుప్పి కళేబరం

తాడ్వాయి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి-మేడారం దారిలో ఆదివారం గుర్తుతెలియని వాహనం ఢీకొని దుప్పి మృతిచెందింది. రోడ్డుదాటుతున్న క్రమంలో వేగంగా వచ్చిన వాహనం తగలడంతో మరణించింది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని దుప్పి కళేబరాన్ని స్వాధీనపర్చుకున్నారు. పంచనామా అనంతరం ఖననం చేశారు.

ములుగులో సీఎం కప్ సైకిల్ ర్యాలీ



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న రవిచందర్

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ క్రీడల్లో భాగంగా ఆదివారం ములుగులో సైకిల్ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ దీన్ని ప్రారంభించారు. ములుగు జిల్లాలో సైక్లింగ్ ర్యాలీని ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్రమంత్రి ధనసరి సీతక్క, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌ల సహకారంతో ములుగులో స్పోర్ట్స్‌స్కూల్, క్రీడా మైదానం కోసం భూమి కేటాయించడం జరిగిందని అన్నారు. జిల్లాలోని క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించి మంచిపేరు తీసుకురావాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి తుల రవి, ఎస్సై లక్ష్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల రేవంత్, నాయకులు లక్కీ, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఐలాపూర్ జాతరకు నిధుల కేటాయింపు హర్షణీయం

కన్నాయిగూడెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని ఐలాపూర్ గ్రామంలో ప్రతి రెండేళ్లకు ఒక సారి జరిగే సమ్మక్క, సారక్క జాతరకు ఏటూరునాగారం ఐటీడీఏ నుంచి రూ. 29 లక్షలు కేటాయించటం హర్షణీయమని కొమురంభీం యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆలం నాగేష్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పనులను సకాలంలో పూర్తిచేసి జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుడా చూడాలన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు

ఏటూరునాగారం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఏటూరునాగారం మండలంలోని చర్చిలు ముస్తాబవుతున్నాయి. ఈనెల 25న పండగ జరగనుండగా ఏర్పాటు ముమ్మరంగా సాగుతున్నాయి. క్రిస్మస్‌కు ముందు రోజు ఆరాధన కార్యక్రమాలను నిర్వహించనుండగా ఇందుకు చర్చిలను సిద్ధం చేస్తున్నారు.

రామప్పను సందర్శించిన ఆసిఫాబాద్ కలెక్టర్

వెంకటాపూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రామప్ప దేవాలయాన్ని ఆదివారం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు హరీష్‌శర్మ, ఉమాశంకర్ సాదరంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామివారి శేషవస్త్రాలు బహూకరించారు. ఆలయ విశిష్టతను టూరిజం గైడ్ ద్వారా తెలుసుకున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పునర్నిర్మాణం, ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు లభించిన తర్వాత జరిగిన అభివృద్ధి, మార్పుల గురించి గైడ్‌ను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

టీపీసీసీ అధ్యక్షుడి చిత్రపటానికి క్షీరాభిషేకం

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ కళాకారులను ఆదుకుంటామని శాసనమండలిలో పేర్కొనడాన్ని పురస్కరించుకుని నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోతె రమేష్ ఆధ్వర్యంలో నాయకులు ములుగులో ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ నిరుద్యోగ కళాకారులను గత పాలకులు విస్మరించారని శాసనమండలిలో టీపీసీసీ అధ్యక్షుడు ప్రస్తావించడం సంతోషకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ కళాకారులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బత్తుల ఉపేందర్, పోలెపాక యాకయ్య, గద్దల రాజేందర్, మందపల్లి నవీన్, శేఖర్, జేఏసీ జిల్లా అధ్యక్షుడు ముంజాల బిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి



లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మంగపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరు హేమాచల కొండలపై వెలసి ఉన్న ఆదిలక్ష్మిచెంచులక్ష్మి సమేత లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో వారంతపు సెలవు ఆదివారం సందర్భంగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి దైవదర్శనం చేసుకున్నారు. ముందుగా చింతామణి జలపాతం వద్ద స్నానమాచరించిన భక్తులు దేవాలయం ఆవరణలో ఉన్న జలాంజనేయ, పంచముఖాంజనేయ, వేణుగోపాలస్వామి, రమాసత్యనారాయణ స్వామిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపై కొలువైన స్వయంభు పుట్టుస్వామిగా వెలుగొందుతున్న లక్ష్మీనర్సింహస్వామిని, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తిల, తైలాభిషేకాలు చేసి భక్తులకు దైవదర్శనం గావించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సత్యనారాయణ, ప్రధాన అర్చకులు రాఘవాచార్యులు, అర్చకులు రాజశేఖరశర్మ, ఉద్యోగులు పాల్గొన్నారు. సుమారు 3వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో సత్యనారాయణ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

టేకుమట్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష పడిందని ఎస్సై ప్రసాద్ తెలిపారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలో వాహనాల తనిఖీలు నిర్వహించగా కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం వంతడపుల గ్రామానికి చెందిన పెనుకూల కుమారస్వామి పట్టుబడినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనం నడపడంతో ఆయన్ను కోర్టు ముందు ప్రవేశపెట్టగా రెండు రోజుల జైలుశిక్షను విధించారని చెప్పారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

మొగుళ్లపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ ముగింపు ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, మొగుళ్లపల్లి జడ్పీహెచ్ఎస్ ఫిజికల్ డైరెక్టర్ గుండెల్లి రాజయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, సీఐ ప్రకాష్, డీవైఎస్‌వో రఘు, వివిధ అసోసియేషన్ల ప్రధాన బాధ్యులు, ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి సంగమం వద్ద సందడి



గోదావరిలో వరం పడుతున్న మహిళలు

మహదేవపూర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) : కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ముఖ్యంగా ఎల్లమ్మ పట్నాలు, బోనాలు వేసే మహిళలు త్రివేణి సంగమంలో వరం పట్టారు. అనంతరం గోదావరికి ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి మాతకు చీర సారెను మొక్కులు అర్పించుకున్నారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శుభానందదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

ముళ్లపొదలను తొలగించిన ఎస్సై

మొగుళ్లపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములుకలపల్లి - పర్లపల్లి గ్రామాల మధ్య మూలమలుపుల వద్ద ఉన్న ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను ఎస్సై బి.అశోక్ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో తొలగించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నిత్యం ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం జిల్లాకేంద్రంతోపాటు మండలకేంద్రానికి వాహనాలపై వెళ్తుంటారని అన్నారు. దీంతో ముళ్లపొదలు, పిచ్చిచెట్ల మూలంగా మూలమలుపుల వద్ద ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరుగకూడదనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మూలమలుపుల వద్ద ఉన్న ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను తొలగించినట్లు పేర్కొన్నారు.

హాస్టళ్లకు ప్రత్యేక భవనాలు నిర్మించాలి

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్కూల్ మేనేజ్‌మెంట్ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా సీనియర్ నాయకుడు అంబాల అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పలు హాస్టళ్ల విద్యార్థితో కలిసి ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ దేవాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి హాస్టల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

మెగా కంటి వైద్య శిబిరం

మహదేవపూర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్, పటేల్ ఐకేర్ మంథని వ్యవస్థాపకులు, ఆప్తాలమిక్ ఆఫీసర్ బుద్దార్థి సతీష్‌కుమార్, రంజిత్ పటేల్ సహకారంతో మహదేవపూర్ మండలం కుంట్లం, పలుగుల గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటిలో శుక్లాలు, తెరియజం, రెటీనాలో సమస్యతో బాధపడుతున్న వారి సమస్యలను పరిష్కరించేందుకు సలహాలు ఇచ్చారు. ఉచిత ఆపరేషన్‌లు చేస్తామని తెలిపారు. కొంతమందికి ఐడ్రాప్స్ అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ రాజేందర్, తిరుపతమ్మ, అంగన్‌వాడీ టీచర్ శ్యామ్, మచ్చ రాజేష్, మాజీ సర్పంచ్ బాపురెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాకేష్, గట్టయ్య పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి స్థల పరిశీలన



గ్రామస్థులతో మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ అనిలారెడ్డి

వాజేడు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ వాడకాన్ని ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో టీజీ రెడ్‌కో వైస్ చైర్మన్ శ్రీమతి అనిలారెడ్డి, ఆమె బృందం సభ్యులు మండలంలో ఆదివారం పర్యటించారు. మండలంలోని చీకుపల్లిలో సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయటం కోసం స్థలాన్ని పరిశీలించారు. స్థలాలను ఇవ్వడానికి ఎవరైనా ముందుకొస్తే సోలార్ విద్యుత్ నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అలిలారెడ్డి తెలిపారు. సోలార్ విద్యుత్‌తో కరెంటు బిల్లులు ఆదా అవుతాయని, మిగులు విద్యుత్‌ను ట్రాన్స్‌కోకు విక్రయించి లాభం పొందొచ్చని తెలిపారు. ఆమె వెంట జిల్లా డివిజనల్ ఇంజనీరు సదానందం, ఏడీఈ అకిటి స్వామిరెడ్డి, ఏఈ అర్షద్ తదితరులు ఉన్నారు.

దారి తప్పిన 'నిఘా'

అక్రమ వ్యాపారాల్లో కానిస్టేబుళ్లు

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో వారు ఉద్యోగులు. నిఘా విభాగంలో వారి విధులు. అక్రమ కార్యకలాపాలను కట్టడి చేయడంలో వీరి పాత్ర కీలకం. అయితే.. వారే అక్రమ వ్యాపారానికి, వసూళ్లకు తెరలేపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో పని చేస్తున్న నిఘా విభాగం కానిస్టేబుళ్ల తీరు విమర్శలకు తావిస్తోంది. ఓ కానిస్టేబుల్ భూపాలపల్లి పరిధిలోని ఓ గ్రామానికి చెందిన కలప వ్యాపారం చేసే వ్యక్తితో జతకట్టి కొంతకాలంగా దందాను సాగిస్తున్నట్లు సమాచారం. భూపాలపల్లిని కేంద్రంగా చేసుకొని పరకాల, వరంగల్, కరీంనగర్, జమ్మికుంట తదితర పట్టణాలకు కలప, ఫర్నిచర్‌ను తయారు చేయించి ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. మరోవైపు ఇదే విభాగంలో పని చేసే ఇంకో కానిస్టేబుల్ సైతం ఇసుక దందాలో నెలవారి వసూళ్లు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం ఆ విభాగం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లగా ఇటీవల కాలంలోనే ఆయన్ను మందలించినట్లు తెలిసింది. అయినప్పటికీ మళ్లీ అక్రమ వసూళ్లపైనే ఆయన దృష్టి పెడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. జిల్లా పరిధిలో నిఘా విభాగంలో పని చేసే కొంత మంది ఏళ్ల తరబడి ఒకే చోట ఉండటం వల్లే ఇలాంటి కార్యకలాపాలకు అనువుగా మారుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకే చోట ఏళ్ల తరబడి పని చేసే వారిని కదిలిస్తే గానీ, ఇలాంటి ఘటనలకు తావుండదనే చర్చ జరుగుతోంది.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



ఎస్టీ బాలికల గురుకులంలో గణిత దినోత్సవం

కాటారం, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు గురుకుల విద్యాలయాలు, కస్తూర్బా విద్యాలయం, మేడిపల్లి ఎస్టీ బాలికల ఆశ్రమపాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని విద్యాలయాల్లో జాతీయ గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆదర్శ విద్యాలయంలో రామానుజన్ సంఖ్య 1729ఆకారరాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయా విద్యాలయాల ప్రిన్సిపాల్స్ మాట్లాడు తూ దేశంలో ఎంతోమంది ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శాస్త్రవేత్తలు, మేధావులు, గణిత శాస్త్రజ్ఞులు జన్మించారని, వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. సున్నాను కనిపెట్టింది కూడా మన శాస్త్రవేత్తలేనన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్స్ కార్తీక్‌రావు, నాగలక్ష్మి, లాల్, మానస, సునిత, శారదశివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీవీ.రావుకు ఘన నివాళులు

మంగపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాలజాతి ముద్దుబిడ్డ పీవీ.రావు 19వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం మండలంలోని అకినేపల్లి మల్లారం గ్రామంలో తెలంగాణ మాలమహానాడు ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు రాజమల్ల సుకుమార్ పీవీ.రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ పీవీ.రావు బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలతో తన జాతికోసం ఐఏఎస్ ఉద్యోగాన్ని వదిలేసి దళితుల ఐక్యత కోసం ఉద్యమించిన యోధుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొంబతిని వాసు, గుండ్ల ప్రదీప్‌కుమార్, గండి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

తవ్వేకొద్దీ ప్రగతి

5వ పేజీ తరువాయి

ప్రారంభిం చారు. అయితే.. ఒక్క బొగ్గు గనితో ప్రారంభించి అంచెలంచలుగా ఎదుగుతూ నాలుగు అండర్‌గౌండ్ గనులు, రెండు ఓపెన్‌కాస్ట్ ప్రాజె క్టులను నడిపిస్తోంది. ఇదేకాకుండా మరో రెండు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించేందుకు సిద్ధ మైంది.

విధులు నిర్వర్తిస్తున్న 5,500 మంది

భూపాలపల్లి ఏరియాలో నాలుగు అండర్‌గ్రౌండ్ గనులు, రెండు ఉపరితల గనులు ఉన్నాయి. వీటిలో కోల్‌కట్టర్, టింబర్‌మెన్, లైన్‌మెన్, ట్రామర్, హాలర్‌డ్రైవర్, మేషన్, కేబుల్‌బాయ్, హెల్పర్స్, ఎస్‌డీఎల్ ఆపరేటర్లు, పంపు డ్రైవర్లు, క్లాంపు ఫిట్టర్లు, రూఫ్‌లేజర్, ఫ్యాన్ ఆపరేటర్లు, టబ్బురిపేరర్లు, క్యాంటీన్లలో పనిచేసేవారు ఉన్నారు. ఆస్పత్రి సిబ్బంది, సెక్యూరిటీ, తోటమాలీలతో కలుపుకొని ఏరియాలో మొత్తం సుమారు 5500 మంది పనిచేస్తున్నారు. వీరిలో 170మంది అధికారులు ఉన్నారు.

అయ్యప్ప దీక్షాపరులకు మాజీ జడ్పీ చైర్‌పర్సన్ అన్నదానం



కాటారం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ ఆనంద ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప దీక్షాపరులకు మాజీ జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి- రాకేష్ దంపతులు ఆదివారం అన్నదానం చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అయ్యప్ప మాలధారులతో కలిసి స్వామివారికి అన్నప్రసాదాలు నైవేద్యంగా సమర్పించారు. మాలధారణతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని శ్రీహర్షిణి అన్నారు. ఈ కార్యక్ర మంలో గురుస్వాములు బచ్చు అశోక్, ప్రకాశ్, రామకృ ష్ణారావు, జక్కు మొగిలి, చీమల రాజు, గంగిరెడ్డి లచ్చిరెడ్డి, వెంకన్న, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

తాడ్వాయి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్.అంబేద్కర్‌పై వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను మండలంలోని కాటాపూర్ గ్రామంలో సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు ఆదివారం దహనం చేశారు. అంతకు ముందు నాయకులు అమిత్‌షా దిష్టిబొమ్మతో గ్రామంలోని పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి దుగ్గి చిరంజీవి మాట్లాడుతూ భారతదేశంలో మతోన్మాద భావజాలాన్ని బీజేపీ నాటాలని, మనుధర్మ శాస్త్రాన్ని తీసుకురావాలని చూస్తుందని అన్నారు. రానున్నకాలంలో రిజర్వే షన్లు లేకుండా చేయాలని చూస్తోందని ఆరోపించారు. తక్షణమే హోంమంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపన చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు చిట్టినేని శ్రీను, ఎర్రోజు సత్యనారాయణ, నర్సింగరావు, బందెల విజయ్, గట్టు మల్లయ్య, వట్టం సంజీవ, మల్లికార్జున్, బాబూరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

హోం మంత్రి రాజీనామా చేయాలి

భూపాలపల్లిటౌన్ (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్రహోం శాఖ మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలకటి రాజయ్య, భూపాలపల్లి ఇన్‌చార్జి రేగుంట నర్సయ్య డిమాండ్ చేశారు. పార్లమెంటులో రాజ్యాంగంపై చర్చ సందర్భంగా అమిత్‌షా కించపరిచినట్టు మాట్లాడారని విమర్శించారు. యావత్ భారత ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పడమే కాకుండా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు చిరంజీవి, హరీశ్, రాజబాబు, శ్యామ్, డేవిడ్, సాల్మాన్, ప్రవీణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన వెంకటస్వామి

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీమంత్రి గడ్డం వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ కొనియాడారు. ఆదివారం కలెక్టరేట్‌లో గడ్డం వెంకటస్వామి వర్ధంతి కార్యక్రమం జరగగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వెంకటస్వామి సుదీర్ఘకాలంపాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంట్ సభ్యుడిగా ప్రాతినిధ్యం వహించారని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తిస్తూ నిరంతరం స్మరించుకునేలా ప్రభుత్వం అధికారికంగా జయంతి, వర్ధంతి వేడుకలను నిర్వహిస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.